


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### నన్ ఆఫ్ మై బిజినెస్!

**మా అన్నయ్య** ఇల్లు అద్దెకిస్తే అద్దెకున్న అతను ఏడాదిగా అద్దె ఇవ్వడంలేదు. ఇల్లు ఖాళీ చెయ్యడం లేదు. ఎప్పుడెళ్ళినా తాగి ఉంటాడుట. బూతులు తిడ్తాడని వీళ్ళు భయపడ్తున్నారు.

"ఏం పని చేస్తాడూ?" అని నేను అడిగాను.

"చేరేటప్పుడు బిజినెస్ అన్నాడు. ఏం బిజినెస్సో నేను అడగలేదు" అన్నాడు వీడు.

"Its not my business to ask అని ఊరుకున్నావా?" అని అడిగాను.

మా వదిన చెప్పింది పాత పేపర్లూ, ఇనప సామాన్లూ కొని అమ్మేవాడుట. అదీ మానేసి తాగి పడుకుంటున్నాడుట.

మా వదిన అతని భార్యతో "ఇల్లెలా గడుస్తోందీ?" అంటే ఆవిడ కంట తడి పెట్టిందట. పెద్ద పిల్ల డిగ్రీ చదివిందట, మా వదిన వాళ్ళని ఉద్ధరించాలని "ఎదురుగుండా స్కూల్ మాకు తెలిసిన వాళ్ళదే. అందులో టీచర్‌గా చెయ్యొచ్చుగా మీ అమ్మాయి?" అందట.

అప్పుడు ఇంట మగమహారాజు లేడు. మళ్ళీ వెళ్ళినప్పుడు అతను తాగకుండా ఉన్నాడుట "ఏవమ్మోయ్ మా అమ్మాయిని టీచర్ ఉద్యోగం చెయ్యాలని సలహా ఇచ్చావుట. తిండికి గడవకపోయినా ఆడదాని చేత పని చేయించే వంశంకాదు మాది" అన్నాడట.

"ఓ పక్కన అప్పులవాళ్ళు వచ్చి టీ.వీ, ఫ్రిజ్జూ పట్టుకుపోతున్నారు వీడి వంశం పరువు పాడుగానూ!" అంది మా అమ్మ.

మా అన్నయ్యతో "ఉద్యోగస్తులుకి ఇవ్వాలిరా ఇలా వ్యాపారాలు చేసుకునే వాళ్ళకి కాదు" అన్నాను.

"హార్డ్‌వేర్ షాప్ అన్నాడే.. నమ్మాను. తెల్లని మల్లెపూలలాంటి చొక్కా వేసుకొచ్చాడు" అన్నాడు తలకిందకి దించుకుని.

"ఇంకోసారి తెల్లచొక్కా వేసుకొస్తే చచ్చినా నమ్మకు. బిజినెస్ అంటే అస్సలు ఇవ్వకు" అన్నాను.

ఓ వారం తర్వాత "ఏరా? టులెట్ బోర్డ్ పెట్టొచ్చావుగా? ఏమైంది? ఎవరైనా ఎంప్లాయీస్ కాల్ చేసారా?" అన్నాను.

"లేదే అందరూ అంట్రప్రెన్యూర్స్ కాల్ చేస్తున్నారు" అన్నాడు.

"ఆంత్రప్రెన్యూర్సే? ఏం చేస్తారుటా?" అన్నాను.

"ఒకతను నాకు షేర్ ఆటోలున్నాయి" అన్నాడు.

"ఇంకొకడు బొచ్చుకొని సవరాలు కడ్తానని" అన్నాడు.

ఇదా ఆంత్రపెన్యూర్స్ షిప్ అని తెగ నవ్వుకున్నాము. మా అన్నయ్యనీ నమ్మలేం. వాడికి అన్నీ తమాషానే. నాకు అన్నగా మరీ!

ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే ప్రతివాడూ బిజినెస్సే. ఏం చేస్తున్నావయ్యా? "స్టార్ట్ అప్" ఇది కొత్తమాట.

మా చిన్నతనంలో పెళ్ళి సంబంధం వస్తే "పిల్లాడికి గవర్నమెంట్ ఉద్యోగం ఉందా?" అని అడిగేవారు. "అధవా బ్యాంక్ ఉద్యోగం అయినా ఉందా?" అని అడిగేవారు.

ఆ రోజుల్లో గవర్నమెంట్ ఉద్యోగస్తులకి చప్పున పెళ్ళి అయిపోయేది. రైల్వే అయితే వాళ్ళ అమ్మా నాన్నల కాళ్ళు కూడా కడిగి పిల్లనిచ్చేవారు. బ్యాంక్ అంటే చేతినిండా డబ్బు ఉంటుంది అని నమ్మకం. (అది ఎవళ్ళదో అయినా ఫర్లేదు)

ప్రతిదానికీ గ్యారంటీ చూసేవారు. "వీడు ఇంకో నలభైఏళ్ళు గ్యారంటీగా ఉద్యోగం చేసి రిటైరౌతాడు" అని నమ్మి పిల్లనిచ్చేవారు. ప్రైవేట్ కంపెనీ అంటే సెకండ్ గ్రేడ్ సిటిజెన్‌లా, బిజినెస్ అంటే 'ఒద్దులే రిస్కు' అనీ అనుకునేవారు.

కానీ ఈ కాలంలోనో... మా డ్రైవర్‌ని "మీ బావమరిది ఏం చేస్తాడూ?"

"బిజినెస్"

"ఏం బిజినెస్?"

"అద్దె సైకిళ్ళ షాప్ ఉంది"

మా ఎదురింటావిడ్ని "మీ తమ్ముడేం చేస్తాడండీ?"

"బిజినెస్సు"

"ఏం బిజినెస్సు?"

"అందరితో చిట్స్ వేయిస్తాడు"

ఇంకా గొప్పగా ఉండేమాట "రియల్ ఎస్టేట్స్".

ప్రతి రెండోవాడూ ఇదే బిజినెస్ హైదరాబాదులో. చివరికి 'టులెట్' బోర్డ్‌లు చూసి, ఇల్లు అద్దెకి ఇప్పించేవాడు కూడా "రియల్ ఎస్టేట్స్" అంటాడు. ఇదివరకు బ్రోకర్ అనేవాళ్ళం. ఇప్పుడు ఏజెంట్ అనాలి. వీడు 'ఏజెంట్ గోపీ'లో సూపర్ స్టార్ క్రిష్ణలా పోజు!

మా పనిమనిషి చెప్తుంది "మా ఆడబిడ్డా బిజినెస్సే, దాని కూతురూ బిజినెస్సే. ఇద్దరూ రోజంతా తిరిగి నెలకి రెండువేలు సంపాదిస్తారు"

"ఏం బిజినెస్సే?"

"పాత చీరలకి స్టీలు సామాన్లు ఇస్తారు."

ప్రతివాడూ 'బిజీ'గా ఉన్నాననడం.. బిజినెస్ అనడం ఫ్యాషన్ అయిపోయింది.

ఈ వర్క్ ఫ్రం హోమ్‌లొచ్చాక, ఎవడు ఖాళీగా ఉన్నాడో తెలీడం లేదు. ఖాళీగా ఉన్నాడు కదా అని "ఏవోయ్ మా ఎల్.కెజీ వాడికి చదువు చెప్తావా?" అంటే, లాప్‌టాప్ ముందునుండి లేచొచ్చి తన్నినంత పని చేస్తాడు. "ఐ యామ్ ఏ సీఈఓ ఆఫ్ ఏ మల్టీ నేషనల్ కంపెనీ" అంటాడు.

మా పనిమనిషి "పాపం పక్కింటి అమ్మ ఉద్యోగం చేసి అలిసొస్తుంది. ఆ సార్‌కి ఉద్యోగమూ పాడూ లేదూ. ఇంట్లనే ఆ కంప్యూటర్‌ల కొట్టుకుంటూ వుంటాడు. ఇద్దరూ సెయ్యక పోతే ఎట్లా గడుస్తుందమ్మా?" అంటుంది.

"అతనే బోలెడు కంపెనీలకి లెఖ్ఖలు చూస్తాడు. లక్షల్లో సంపాదిస్తాడు" అంటే నమ్మదు.

"అసలెప్పుడూ ఇంట్లోనే ఉంటాడుగా మరీ! మా ఆయనలా పనికిపోడుగా? ఏ ఆఫీసర్ ఊరుకుంటాడు పోకపోతే?" అంటుంది.

ఈ పెద్దపెద్ద సిటీల్లో అంతా ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకుని ఈ ఉద్యోగులు గంటల తరబడీ అటు ఇంటికీ ఇటు ఆఫీసుకీ కాకుండా, గోళ్ళు కొరుక్కుంటూ, సెల్‌ఫోన్‌లలో చాటింగ్‌లు చేస్తున్నారని, కొన్ని కంపెనీలు "ఇంట్లోనే వుండి పనిచేసి పెట్టండి, పెట్రోల్, టైం కలిసొస్తాయి" అనేస్తున్నారు.

ఎన్నిమారినా మనదేశంలో ఈ గవర్నమెంట్ ఆఫీసులు మారవు. నిన్న ఎల్.ఐ.సీ ఆఫీసుకి నేనూ మా వదినా వెళ్ళాం. మెట్లు ఎక్కుతూ వుంటే, గోడమ్మట పాన్ ఉమ్ములు. తీరా ఆఫీసులోకి ఎంటర్ అయితే 'డబడబశబ్ధం' ఏవిటా అని చూస్తే.. నా చిన్నప్పటి 'ఉషా' ఫ్యాన్లు, కుర్చీలో కూర్చోబోతే, ఎదురు ఆవిడ 'కెవ్వు'మని అరిచింది, "దాని కోడు విరిగింది. పడిపోతారు" అని.

తీరా ఇంకో కుర్చీలో కూర్చుంటే దాని శరీరంలో నట్లు లూజ్ అయి "జయమాలిని"లా వూగి వయ్యారాలు పోతోంది.

కాఫీలిచ్చే కప్పులకి చెవులు లేవు. బాత్‌రూంకి బోల్టులు లేవు. పైగా ఈ 'కీళ్ళ నెప్పుల' కాలంలోనూ ఇక్ష్వాకుల టైప్ ఇండియన్ టాయ్‌లెట్స్.

ఆడ ఎంప్లాయిస్ నోములు అవీ నోచుకుని కాస్త ఆలశ్యంగా బస్‌లెక్కి వచ్చేసరికి లంచ్ టైం అవుతుంది. లంచ్ చేసారుగా అనుకుంటే, 'సర్వర్ డౌన్' అంటూ ఉన్న ఒక్క కంప్యూటరూ పని చెయ్యదు. "అసలు అన్నీ ఆన్‌లైనే. డబ్బు అన్నది కళ్ళకి కనిపించకుండా, తియ్యండీ.. వెయ్యండీ" అనే ప్రధానమంత్రి పాలనలో కూడా వీళ్ళు అన్ని మాన్యుయలే! వెళ్ళి చేతికి ఇచ్చి సంతకం పెట్టి రావాలి ప్రతికాయితం మీదానూ!

"అమ్మా విట్‌నెస్ సైన్" అందావిడ.

"నేను పెడ్తా" అని మా వదిన పెడ్తుంటే,

"మా వదిన.. " అన్నా. సొళ్ళుకాకపోతే నన్ను ఎవరు అడిగారూ?

"అయ్యో రిలెటీవ్స్ పెట్టకూడదు" అని కాయితం వెనక్కి లాక్కుందావిడ.

నా డబ్బు.. నా ఎకౌంట్లోకి పోతోంది. మా వదిన రిలేటివ్ కాబట్టి పెట్టకూడదు. ఇవాళ ఉండి రేపు పోయే మా డ్రైవర్ పెట్టచ్చుట (పోయే అంటే ఉద్యోగం మానేసి పోయే అని!) ఇదెక్కడి రూల్స్?

అందుకు కాదూ అస్సలు ఈ గవర్నమెంట్ ఎంప్లాయిస్‌కి పిల్లని ఇవ్వనిదీ?

మా చిన్నప్పుడు సందానీ వచ్చి "మాకీ అత్తకీ బిడ్డ ఉన్నయ్. దానికీ షాదీ. ఇయ్యాల చూస్కోనికి వస్తయ్" అన్నాడు.

సందానీ ఆపా జీనత్‌కి ఆ నెలలో మొదటిసారి తలంటుపోసి, చమ్కీల చున్నీ వేసి, తలనిండా కాగడాపూలు పెట్టి, మోచేతుల దాకా మెహందీ పెట్టి, సందు చివరకి వాసనొచ్చేటంత అత్తరు కొట్టారు.

భవానీ, నేనూ పిట్టగోడ దిగితే ఒట్టు. ఆ పెళ్ళిచూపులు మా ఆధ్వర్యంలో జరగాలని.

సందానీ అబ్బాజాన్ 'గోష్' తెచ్చాడు. వీళ్ళ అత్తమొగుడికి మటన్ షాప్ ఉంది.

పెళ్ళివారు ఆటోలో పన్నెండుమంది కిక్కిరిసి దిగారు. అంతా ముసలీ, ముతకా, ఆడవాళ్ళూ! పెళ్ళికొడుకు ఏడీ? అంటే.. ఆటో ఆపు చేసి వచ్చాడు. అతనే పెళ్ళికొడుకు. ఆటోడ్రైవరట.

జీనత్‌కి ఇంత ముస్తాబు చేసి, తీరా వాళ్ళు రాగానే పైన బురఖా వేసేసారు.

పెళ్ళికొడుకు ఏం చూస్తాడూ? మేకమాంసం తిన్నారు. సారాయి తాగారు.

"కతికితే అతకదే బూబీ!" అని మా సరోజిని అమ్మమ్మ చెప్పినా ఎవ్వరూ వినలేదు.

ఫెళ్ళున నవ్వారు. ఒకళ్ళని ఒకళ్ళు కౌగలించుకున్నారు. ఖాజీతో లగ్గం పెట్టించాలి అనుకున్నారు. అంతా బానే ఉంది. ఆటోస్టార్ట్ చేస్తుండగా పెళ్ళికొడుకు. పెళ్ళికూతురు బాబాయ్ ఏదో బూతు తిట్టు తిట్టాడుట. పెళ్ళికొడుకు తండ్రిని "నిక్కా చేసుకునే రకమా? సొంత

ఆటో కూడా లేవు" అని పెళ్ళికొడుకు తండ్రి ఆటో దిగి సంస్కృతంలో తిడ్తూ ఇతన్ని రెండు గుద్దులు గుద్దాడు. పెళ్ళికొడుకు ఆటో ఆపి దిగి, నాలుగుపిడి గుద్దులు పెళ్ళికూతురి బాబాయ్‌ని కొట్టాడు. ఆడవాళ్ళు కూడా కొప్పులు పట్టుకుని లాగి, బురఖాలు తీసి, ఒంగి ఒంగి సలాంలు చేసుకున్న వాళ్ళే పళ్ళూడి రక్తం కారేట్టు కొట్లాడుకున్నారు.

"శుభమా అని పెళ్ళిచూపులకొచ్చి ఈ తాగుడేవిటని - బుర్రలు బద్దలు కొట్టుకోవడం ఏవిటో?" అని అమ్మమ్మ మమ్మల్ని రెక్కబుచ్చుకుని లాక్కొచ్చి ఇంట్లోకి తలుపేసింది.

మాకైతే గొప్పసినిమా మిస్ అయిపోతున్న ఫీలింగ్‌తో అమ్మమ్మ మీద మా చెడ్డకోపం వచ్చింది.

మరునాడు మా సందానీగాడు లాగూ జారిపోతుంటే పైకి తోసుకుంటూ "ఏ.వీ రమణీ.. ఏ.వీ రమణీ.. ఆటో ఆట ఆడుకుంటాయి?" అని ఆటో నుండి ఊడబీకిన హారన్ పట్టుకొచ్చి "పాం పాయ్" అని నొక్కుతూ వచ్చాడు. ఆ పెళ్ళివారి తన్నులాటలో వీడికి దొరికిన నిధీ అదీ! వీడి మొహం వెలిగిపోతోంది.

మా డ్రైవర్ కుమార్ చెప్తాడు "తాగకుండా, నాలుగు తలలు పగలకుండా ఏ 'దావత్' జరగదు మాలో" అని. ఇదీ వారి సంప్రదాయం.

ఇంక భూదేవమ్మగారింట్లో పెళ్ళిచూపులే చెప్పాలి. మొదట్లో పెద్ద గున్నకి (అది ముద్దుపేరు పర్వత వర్ధినికి) పెళ్ళిచూపులు అంటే "జిలేబీ చుట్టలూ, ఆకు పకోడా, వేయించిన జీడిపప్పూ" పెట్టేవాళ్ళు.

"అమ్మాయి కొంచెం సుకుమారంగా వుంటే బాగుండేది" అని వచ్చిన వాళ్ళు అన్నీ శుభ్రంగా తిని పోతుంటే, పల్లీ పాకం, కారం బూందీతో సరిపెట్టింది ఆవిడ. ర్రానాను 'టీ ఇచ్చి రెండు రసుకులు పెట్టి సరిపుచ్చింది నూట ఒకటో పెళ్ళిచూపులకి 'చక్కెర నీళ్ళిచ్చి' తాగితే తాగండి" అంది.

పెద్దగున్నకి పెళ్ళికానేలేదు, చిన్న గున్న (రమ్యవర్ధిని)కి పెళ్ళిచూపులు మొదలయి పోయాయి. పెళ్ళికొడుకు వకీలు అన్నారు. 'పెండలం చిప్సూ, మైసూర్‌పాకం' తిని పిల్ల నచ్చిందన్నాడు. అంతా ఎగిరి గంతులేసారు.

"ఏ మాత్రం సంపాయిస్తాడు అబ్బాయీ?" అని అడిగారు.

"వెయ్యి" అన్నారు.

వీళ్ళు ఎగిరి గంతులేసారు. నెలకి వెయ్యి అంటే అప్పట్లో 'నాలుగంకెల' జీతగాడు గొప్ప సంబంధం అన్నట్టే.

ఉన్న ఒక్క ఇల్లూ తాకట్టు పెట్టి పెళ్ళి జరిపించారు. పెద్దగున్న కుళ్ళుగా చూస్తూ అక్షింతల బియ్యం తింటూ కూర్చుంది.

పెళ్ళయి చిన్న గున్న అత్తారింటికి వెళ్ళనే లేదు. ఆ వచ్చిన పెళ్ళికొడుకు ఇల్లరికం ఉండిపోయాడు.

"వకీలు అన్నారూ? వెయ్యిరూపాయలు వస్తాయి అన్నారూ? " అని మా శ్యామలమ్మ అడగడానికి వెళ్ళింది.


"వకీలే వాళ్ళ మేనమామ. ఇతను ఆయన దగ్గర గుమాస్తా. ఏవైనా ఆయనకి కేసులొస్తే ఇతనికి డబ్బులిస్తాడుట. సంవత్సరానికి వెయ్యి వస్తాయిట" అని చెప్పి నెత్తికొట్టుకుంది భూదేవమ్మ.


అప్పట్లో అలా అబద్ధాల పెళ్ళిళ్ళు కూడా అయ్యేవి. "వెయ్యి అబద్ధాలు ఆడైనా ఒక్క పెళ్ళి జరిపించాలి" అన్నవాడిని "నిన్ను ఖూనీ చేసైనా ఆ అమ్మాయి జీవితం నిలబెట్టాలి" అనాలనిపించేది నాకు.

మగాడి ఉద్యోగ విషయంలో అబద్ధం చెప్పి చేసే పెళ్ళిళ్ళు నిలబడవు.

అసలు ఇదంతా None Of Your Business అన్నా సరే. 'బిజినెస్ చేస్తున్నా' అంటే 'ఏం బిజినెస్?' అని అడక్కుండా ఇల్లు అద్దెకివ్వకండి. పిల్లని అంతకన్నా ఇవ్వకండి. ఆడపిల్లల్ని గల్ఫ్‌కి అమ్మే బిజినెస్ కూడా ఇంటర్నేషనల్ మార్కెట్‌లో అతి పెద్ద బిజినెస్! "దొంగ వెధవలుంటారు జాగ్రత్త!"

Post your comments


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి


కాలమ్ దాటని కబుర్లు-II
బలభద్రపాత్రుని రమణి